ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 23 జనవరి 2024

అయోధ్యలో ప్రాణప్రతిష్ఠతో జిల్లాలో మార్మోగిన రామనామం
బాలరాముడి దర్శనంతో పులకించిన జనం



జై శ్రీరామ్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు... ఊరూరా శోభాయాత్రలు


అగళిలో శ్రీరాముని చిత్రపటం ఊరేగింపు


సోమందేపల్లిలో శోభాయాత్ర


మడకశిరలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీరాముని సహస్రనామార్చన చేస్తున్న మహిళలు

హిందూపురం అర్బన్, జనవరి 22: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో జిల్లా అంతటా సోమవారం ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది. రామనామం మార్మోగింది. బాలరాముడి దర్శనంతో జనం పులకించిపోయారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు నిర్వహించారు. మైకుల్లో రామ కీర్తనలు, భజనలు హోరెత్తాయి. ఎవరు ఎదురు పడినా జై శ్రీరామ్ అంటూ పలకరించుకోవడం విశేషం. పలుచోట్ల పానకం అందించారు. అన్నదానం చేశారు. ప్రాణ ప్రతిష్ఠ ముహూర్త సమయంలో బాణసంచా కాల్చి, జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు. చిన్నాపెద్ద తేడాలేకుండా, మహిళలు సైతం పెద్దఎత్తున పూజల్లో పాల్గొన్నారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని వీక్షించేందుకు టీవీలకు అతుక్కుపోయారు. ఆలయాల్లో సైతం బిగ్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. సీతారామలక్ష్మణ, ఆంజనేయుడి విగ్రహాలతో సాయంత్రం శోభాయాత్రలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పెద్దఎత్తున జనం పాల్గొన్నారు.


హిందూపురంలోని యల్లమ్మ దేవాలయంలో భజన చేస్తున్న మహిళలు


గోరంట్లలో ర్యాలీ చేస్తున్న రామభక్తులు


అరెస్టు చేయడంతో రోడ్డు పక్కన కూర్చుండిపోయిన అంగన్‌వాడీలు

ప్రభుత్వానికి ఉసురు తప్పదు

- కాంగ్రెస్‌కు పట్టిన గతే.. వైసీపీకీ..
- అంగన్‌వాడీల శాపనార్థాలు
- చలో విజయవాడకు వెళ్లకుండా పోలీసుల అడ్డంకులు
- ఎక్కడికక్కడ అరెస్టులు
- అక్కడే బైఠాయించి కార్యకర్తల నిరసన


ధర్మవరం రైల్వే స్టేషన్‌లో బైఠాయించిన అంగన్‌వాడీలు

హిందూపురం అర్బన్, జనవరి 22: సమస్యలు పరిష్కరించమని కోరితే హింసిస్తున్న ప్రభుత్వానికి తమ ఉసురు తగలక మానదని అంగన్‌వాడీలు శాపనార్థాలు పెట్టారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు సోమవారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా పోలీసులు అడ్డంకులు సృష్టించారు. అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. కోటి సంతకాల పత్రాలను సీఎంకు అందించాలని సోమవారం చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు విజయవాడలోనే సమ్మె చేపట్టాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. దీంతో బస్సు, రైలు తదితర మార్గాల్లో విజయవాడ బయల్దేరిన అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. అడ్డుకున్న చోటే వారు బైఠాయించి, నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ.. సీఎం జగన్‌ను నమ్మినందుకు అక్కచెల్లెమ్మలకు తగిన శాస్తి చేశాడని దుమ్మెత్తిపోశారు. సొంత చెల్లి, తల్లిని ఆదరించని సీఎం తమను ఆదుకుంటాడనుకోవడం అమాయకత్వం అన్నారు. ఉన్నతాధికారులు.. అంగన్‌వాడీలను భయభ్రాంతులకు లోనుచేస్తున్నారన్నారు. ఎస్మా, టెర్మినల్ నోటీసులతో పెత్తనం చెలాయిస్తున్నారన్నారు. దీంతో కొంతమంది సోమవారం జాయిన్ లెటర్లు రాసిచ్చి, విజయవాడకు తరలి వెళ్లారని అంగన్‌వాడీల యూనియన్ నేత లావణ్య పేర్కొన్నారు. సమైక్యాంధ్ర ఉద్యమంలో కాంగ్రెస్‌కు పట్టిన గతే వైసీపీకి పడుతుందని శాపనార్థాలు పెట్టారు. చేతకానప్పుడు ఎందుకు ప్రగల్భాలు పలికారని నిలదీశారు. ఓట్లకోసం నాటకాలాడి ఇప్పుడు ఏరుదాటాక తెప్పతగలేసినట్లు వ్యవహరిస్తున్న సీఎంకు తగిన బుద్ధి చెప్పే సమయం దగ్గరలో ఉందని ఆగ్రహించారు. కొందరు అంగన్‌వాడీలు ప్రైవేటు వాహనాల్లో విజయవాడకు తరలివెళ్లారు.

రాత్రయినా బస్సు రాకుంటే ఎలా..?

విద్యార్థుల ఆగ్రహం.. రోడ్డుపై బైఠాయించి ఆందోళన


బస్సు కోసం ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మడకశిరటౌన్, జనవరి 22: ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంపై విద్యార్థులు ఆగ్రహించారు. నడిరోడ్డుపై ఆందోళనకు దిగారు. పట్టణంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు రొళ్ల, అగళి మండలాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో విద్యార్థులు వస్తారు. సాయంత్రం తిరిగి స్వగ్రామాలకు వెళ్లారు. సోమవారం పాఠశాల, కళాశాలల వేళలు ముగియడంతో విద్యార్థులు స్థానిక రాజీవ్‌గాంధీ సర్కిల్‌కు చేరుకుని, బస్సుల కోసం వేచిచూశారు. రాత్రయినా బస్సులు రాలేదు. దీంతో ఆగ్రహించిన విద్యార్థులు రాత్రి 7.30 గంటల సమయంలో అక్కడే రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలిపారు. విద్యార్థులు మాట్లాడుతూ.. ఇటీవలిగా బస్సులు సకాలంలో రావడం లేదనీ, దీంతో తాము గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని ఆవేదన చెందారు. విద్యార్థులకు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నాయకులు శశికుమార్, నవీన్, కోట్ల రవి, హరివేంద్ర తదితరులు మద్దతు తెలిపారు. సమయానికి బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. చివరకు ఆర్టీసీ అధికారులు మడకశిర నుంచి శిరా వెళ్లే బస్సును విద్యార్థుల కోసం పంపడంతో ఆందోళన విరమించి, గ్రామాలకు వెళ్లిపోయారు.

టీడీపీ హయాంలో పదవులు..

వైసీపీ పాలనలో కేసులు..

- తెలుగుదేశంతోనే బీసీలకు గుర్తింపు
- బీసీ నేతలను అణచివేస్తున్న జగన్
- మాజీ మంత్రి పల్లె ధ్వజం
- దుద్దుకుంటది మభ్యపెట్టే యాత్ర అంటూ ఎద్దేవా


మాట్లాడుతున్న పల్లె రఘునాథరెడ్డి


బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బుక్కపట్నం, జనవరి 22: తెలుగుదేశం పార్టీ.. బీసీలను గుర్తించి పదవులు ఇస్తే.. వైసీపీ కేసులు పెట్టి అణచివేసిందని మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని ఆయన అన్నారు. మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ఆవరణలో సోమవారం జయహో బీసీ సమావేశం నిర్వహించారు. అంతకుముందు మండలంలోని కృష్ణాపురం నుంచి బుక్కపట్నం వరకు బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం జయహో బీసీ కార్యక్రమంలో పల్లె మాట్లాడుతూ.. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు.. బీసీల కోసం అనేక చట్టాలు తెచ్చారన్నారు. రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎన్నో పదవులు ఇచ్చి, బీసీల అభ్యున్నతికి బాటలు వేశారన్నారు. వైసీపీ పాలనలో బీసీలను అణచివేశారని మండిపడ్డారు. ప్రజాసమస్యలపై పోరాడుతున్న బీసీ నేతలపై వైసీపీ ప్రభుత్వం అనేక అక్రమ కేసులు బనాయించిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన రూ.1.14 లక్షల కోట్ల నిధులను దారి మళ్లించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. బీసీలకు ద్రోహం చేసిన వ్యక్తి సీఎం జగన్ అని మండిపడ్డారు. టీడీపీతోనే బీసీల అభివృద్ధి సాధ్యమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఆ వెంటనే బీసీలకు ప్రత్యేక చట్టం తీసుకొస్తామని హామీ ఇచ్చారు. బీసీలు ఏకమై, టీడీపీని గెలిపించుకోవాల్సి ఉందన్నారు. చంద్రబాబును సీఎం చేసుకుంటేనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు.

మళ్లీ మభ్యపెట్టేందుకు ఎమ్మెల్యే పాదయాత్ర

ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పాదయాత్రపై పల్లె విమర్శలు గుప్పించారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో నింపుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే.. దానిని తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికల వేళ ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు పాదయాత్ర చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల సమయంలో తనను గెలిపిస్తే ఏడాదిలోపే నియోజకవర్గంలోని 193 చెరువులకు నీరిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 2018లో టీడీపీ అధికారంలో ఉన్నపుడు చెరువులకు నీరిచ్చే కార్యక్రమానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కొనసాగించారన్నారు. చెరువులను నింపడానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం డీపీఆర్ సర్వే కోసం నిధులు విడుదల చేసిన సంగతి గుర్తు చేశారు. దుర్మార్గపు వైసీపీ అధికారంలోకి వచ్చాక దానిని పూర్తిగా గాలికి వదిలేసిందన్నారు. టెండర్ల పేరుతో ఎత్తిపోయిన బినామీ కంపెనీలకు పనులను అప్పగించడం శోచనీయమన్నారు. ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడానికి పాదయాత్ర పేరుతో ఎమ్మెల్యే కొత్తనాటకం ఆడుతున్నారని దుయ్యబట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని చెరువులను నింపుతామని పల్లె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ చింతా మల్లిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, బీసీ నాయకులు బోయ రామాంజనేయులు, పల్లపు రవీంద్ర, సయ్యద్ బాషా, అంజినప్ప, జనసేన సమన్వయకర్త పత్తి చంద్రశేఖర్, అబ్దుల్లా, జయరాం, మహిళా నేతలు లావణ్య గౌడ్, సాకే యశోద, తెలుగుయువత గోపాలపురం గంగాధర్, నరేష్ పాల్గొన్నారు.

మహిళలే అధికం

జిల్లా మొత్తం ఓటర్లు

13,91,628

- పురుషులు 6,94,446
- మహిళలు 6,97,119
- ఇతరులు 63 మంది
- కొత్త ఓటర్లు 48,316
- తుది ఓటరు జాబితా విడుదల


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, జనవరి 22: జిల్లా తుది ఓటరు జాబితా వచ్చేసింది. మహిళా ఓటర్లే అధికంగా ఉండడం విశేషం. త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ రూపొందించిన ఓటరు తుది జాబితాను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు విడుదల చేశారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 13,91,628 మంది ఉన్నారు. వీరిలో పురుషులు 6,94,446 మంది, మహిళలు 6,97,119 మంది, ఇతరులు 63 మంది ఉన్నారు. కొత్తగా 48,316 మంది ఓటర్లు పెరిగారు. వీరిలో పురుషులు 20,491, మహిళలు 27,825 మంది ఉన్నారు. నియోకవర్గాల వారీగా ఓటర్లు మడకశిర 2,11,074, హిందూపురం 2,46,463, పెనుకొండ 2,33,682, పుట్టపర్తి 2,10,076, ధర్మవరం 2,39,557, కదిరి 2,50,776 మంది ఉన్నారు. జిల్లాలో అత్యధికంగా కదిరిలో ఓటర్లు ఉండగా, అత్యల్పంగా పుట్టపర్తిలో ఉన్నారు. హిందూపురంలో అత్యధికంగా 13,081 మంది ఓటర్లు పెరగ్గా.. ధర్మవరంలో అత్యల్పంగా 5,385 మంది పెరిగారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మృతిచెందిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి, తొలగించామని, యువ ఓట్లను నమోదు చేశామన్నారు. పదికంటే ఎక్కువ ఓట్లు ఉన్న ఇళ్లను విచారణ చేయడంతో ప్రత్యేక శ్రద్ధ వహించామన్నారు. అనంతరం వివిధ పార్టీలతో ఆయన చర్చించారు. ఎన్నికల్లో నామినేషన్ల చివరి తేదీ వరకు ఫారం 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 1,561 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు జాబితా పరిశీలించడానికి అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

31లోగా ఎన్నికల ఏర్పాట్లు పూర్తికావాలి

పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లను ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు.. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల ఏర్పాట్లపై మండలస్థాయి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో 1,561 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో మరుగుదొడ్లు, ర్యాంపులు ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. తలుపులు, కిటికీలు, విద్యుత్, నీడ ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి క్రిష్ణారెడ్డి, సర్వే ఏడీ రామకృష్ణ పాల్గొన్నారు.

ఎంత పనిచేశావు అమ్మా..!

బిడ్డ సహా బావిలో దూకిన తల్లి

తల్లిని కాపాడిన ఆటో డ్రైవర్... బిడ్డ మృతి


కూతురు సాత్వీ మృతదేహం వద్ద శోకసంద్రంలో తల్లి శ్రావణి (వృత్తంలో..)

నంబులపూలకుంట, జనవరి 22: అమ్మకు ఏ కష్టమొచ్చిందో.. ఎంత కష్టమొచ్చిందో తెలియదు గానీ ప్రాణం తీసుకోవాలనుకుంది. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డను వదిలి వెళ్లలేక తనతోపాటు తీసుకెళ్లాలనుకుంది. బిడ్డసహా బావిలో దూకింది. దారి వెంట వెళ్తున్నవారు ఆ తల్లిని కాపాడారు. బిడ్డ మాత్రం బావిలో మునిగి ప్రాణాలు విడిచింది. అచేతనంగా ఉన్న తన బిడ్డను చూసి ఆ అమ్మ గుండెలు పగిలేలా రోదించింది. మండలంలోని పి.కొత్తపల్లి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్దగల బావిలోకి తన రెండేళ్ల బిడ్డ సాత్వీ సహా తల్లి శ్రావణి దూకి, ఆత్మహత్యకు యత్నించింది. శ్రావణిని దారిన వెళ్తున్న ఆటోడ్రైవర్ కాపాడగా.. సాత్వీ ప్రాణాలు కోల్పోయింది. మండలంలోని మల్లెంవారిపల్లికి చెందిన వెంకటనర్సు, ప్రమీల దంపతుల కుమార్తె శ్రావణికి అన్నమయ్య జిల్లా శివరాంపల్లి వాసి గణేష్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె సాత్వీ ఉంది. కుటుంబ కలహాల కారణంగా శ్రావణి పుట్టింటికి వచ్చి, ఇక్కడే ఉంటోంది. ఈ నేపథ్యంలో భర్తతో ఫోన్‌లో ఏమి సంభాషణ సాగిందో తెలియదుకానీ, సోమవారం బిడ్డ సాత్వీ సహా శ్రావణి ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. పి కొత్తపల్లి సమీపంలోకి నిండుగా ఉన్న బావి వద్దకెళ్లి దూకేసింది. ఇంట్లో శ్రావణి లేకపోవడాన్ని తల్లి ప్రమీల గమనించింది. వెతుక్కుంటూ వెళ్లగా.. అప్పటికే బావిలో మునిగిపోతున్న శ్రావణిని చూసి కాపాడాలంటూ కేకలు వేసింది. రోడ్డు మీదుగా వెళ్తున్న ఆటోడ్రైవర్ శీను వచ్చి, శ్రావణిని కాపాడాడు. సాత్వీ అప్పటికే నీట మునిగింది. పెడబల్లి నుంచి ఈతగాళ్లు వచ్చి, బావిలో వెతకగా.. బిడ్డ మృతదేహం లభించింది. బిడ్డ మృతదేహాన్ని చూసి తల్లి, కుటుంబికులు బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ పొడిగింపే..

సొసైటీల్లో కమిటీల పాలనే..

మరో ఆరునెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు

దొడ్డిదారిన కమిటీలు.. పాలనపై విమర్శలు

ఎన్నికల సాహసం చేయని వైసీపీ ప్రభుత్వం



జిల్లా సహకార శాఖ కార్యాలయం

ధర్మవరం, జనవరి 22: రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పనిచేయాలి. వారి భాగస్వామ్యం లేకుండా సంఘాల్లో వారి పాత్రను దూరం చేసేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈ క్రమంలో మరో ఆరునెలలు త్రిసభ్య కమిటీల ఆధ్వర్యంలోనే సహకార సంఘాల కార్యకలాపాలు కొనసాగనున్నాయి. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలతో ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఐదేళ్లుగా సహకార ఎన్నికలు నిర్వహించే సాహసం ప్రభుత్వం చేయలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీల పాలనను కొత్తగా ప్రవేశపెట్టింది. దీనిని కొనసాగించేందుకే ప్రభుత్వం మొగ్గు చూపింది. మరో ఆరునెలలు ఆయా కమిటీల పాలనను కొనసాగిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ నేతలకు పదవులు ఇచ్చుకునేందుకు ఎన్నికలను నిర్వహించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. వాటిని లెక్క చేయకుండా ప్రత్యేక కమిటీలనే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 51 పీఏసీఎస్‌లు ఉన్నాయి. త్రిసభ్య కమిటీల పదవీకాలం ముగిసింది. దీంతో ఈనెల 18 నుంచి జూలై 17వరకు ఆ కమిటీల పదవీకాలం పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాలకు అతీతంగా సహకార సంఘాలు పనిచేయాల్సి ఉండగా.. రాజకీయ జోక్యం మితిమీరింది. దీంతో తీవ్ర అన్యాయం వాటిల్లుతోందని రైతులు వాపోతున్నారు. ఎన్నికలు నిర్వహిస్తేనే సొసైటీలను బలోపేతం చేయడంతోపాటు రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేసే అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

2013లో చివరి ఎన్నికలు

సహకార సంఘాలకు చివరగా 2013లో ఎన్నికలు నిర్వహించారు. వాటి గడువు 2018లో ముగిసింది. అప్పటి నుంచి ఎన్నికలు జరగలేదు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సొసైటీల అధ్యక్షుల పదవీకాలాన్ని 2019 వరకు పొడిగించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్నికలు ఉంటాయని అందరూ ఎదురుచూశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితాను కూడా అధికారులు సిద్ధం చేశారు. ముందుగా వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇలా రెండుసార్లు ప్రకటనలు చేసినా ఎన్నిక నిర్వహించేందుకు వైసీపీ ప్రభుత్వం సాహసం చేయలేదు. పైగా త్రిసభ్య కమిటీల పాలనను సొసైటీల్లో ప్రవేశపెట్టింది.

త్రిసభ్య కమిటీల ఇష్టారాజ్యం

జిల్లాలోని కొన్ని సహకార సంఘాల్లో త్రిసభ్యకమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ఎన్నికలు లేకపోవడంతో తాత్కాలిక కమిటీలు అక్రమాలకు తెరతీశాయని ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్న విమర్శలున్నాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో కొత్త వారిని ఆయా కమిటీలు నియమించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. మార్చి 2019 కన్నా ముందుగా సొసైటీల్లో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేసేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు 2020 డిసెంబరులో ప్రభుత్వం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్వర్వులను తుంగలో తొక్కి అక్రమ మార్గంలో ఉద్యోగులను కొన్ని త్రిసభ్యకమిటీలు నియమించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలా నియామకాలకు రూ.లక్షల్లో డబ్బు చేతులు మారినట్లు ప్రచారం ఉంది. ఆయా నియామకాలపై విచారణ చేపడితే అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి.


గుత్తిలో కంటతడి పెడుతున్న అంగన్‌వాడీలు


అనంతలో...


అనంతలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు


చికిత్స పొందుతున్న అంగన్‌వాడీ సహాయకురాలు సరితను పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

వస్తారా..? రారా..?

- అంగన్‌వాడీల మెడపై కత్తి
- హడలిపోయి విధుల్లో చేరిన పలువురు
- కన్నీరు కారుస్తూ జాయినింగ్ లెటర్లు
- సీడీపీఓ కార్యాలయాల వద్ద ఉద్వేగం
- అనంతలో ఒకరి ఆత్మహత్యాయత్నం
- ప్రభుత్వం తీరుపై సీపీఎం, సీఐటీయూ ఆగ్రహం
- క్లాక్ టవర్ సర్కిల్‌లో రాస్తారోకో.. నాయకుల అరెస్టు
- రేపు రాష్ట్ర బంద్‌కు పిలుపు

అనంతపురం విద్య/గుత్తి, జనవరి 22: పెరిగిన ధరలకు.. వచ్చే వేతనానికి పొంతన లేకుండా పోయింది. పనిభారం మాత్రం నానాటికీ పెరుగుతోంది. కనీస వేతనం ఇచ్చి తమను కష్టాల నుంచి గట్టెక్కించాలని ప్రభుత్వానికి ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో సమ్మెకు దిగారు. జిల్లా వ్యాప్తంగా 42 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. సానుభూతితో పరిశీలించాల్సిన ప్రభుత్వం.. 'విధుల్లో చేరుతారా..? ఉద్యోగాల నుంచి తొలగించమంటారా..?' అని బెదిరింపులకు దిగింది. దిక్కుతోచని స్థితిలో కొందరు విధుల్లో చేరారు. ఈ క్రమంలో కన్నీటిపర్యంతం అయ్యారు. ఒకరు విషం తాగి ఆత్మహత్యకు యత్నించారు. ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ సీఐటీయూ, సీపీఎం నాయకులు నగరంలో ఆందోళనకు దిగారు. పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఈ నెల 24న అన్ని ట్రేడ్ యూనియన్లు రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి.

కన్నీటి సుడులు

షోకాజ్ నోటీసు గడువు ముగియడంతో ఉద్యోగాలు పోతాయన్న భయంతో పలువురు విధుల్లో చేరేందుకు సీడీపీఓ కార్యాలయాల వద్దకు వెళ్లారు. జిల్లాలోని 11 సీడీపీఓ ప్రాజెక్టుల వద్దకు ఉదయమే వందలాది మంది చేరుకున్నారు. అనంతపురం, రూరల్, గుత్తి సీడీపీఓ కార్యాలయాల వద్ద పలువురు కన్నీరు పెట్టుకున్నారు. గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన అంగన్‌వాడీలు గుత్తి సీడీపీఓ కార్యాలయంలో జాయినింగ్ లెటర్లు ఇచ్చారు. ఈ క్రమంలో పామిడికి చెందిన జయంతి అనే కార్యకర్త విలపిస్తూ సొమ్మసిల్లి పడిపోయారు. ఆమెను తోటి వర్కర్లు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షిస్తుండగా, పక్కనే ఉన్న టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సావిత్రి, పామిడికి చెందిన యశోద, గుంతకల్లుకు చెందిన రేష్మాఖాన్ సొమ్మసిల్లి పడిపోయారు. వీరందరికీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందజేశారు. మహిళల ఏడ్పులతో గుత్తి సీడీపీఓ కార్యాలయం, ఆస్పత్రి వద్ద విషాద వాతావరణం కనిపించింది. అంగన్‌వాడీల ఆవేదన చూసిన పలువురు యూనియన్ నేతలు వారిని ఓదార్చారు. బాధపడవద్దని, సమ్మెను తాత్కాలికంగానే వాయిదా వేస్తున్నామని తెలిపారు.





హెల్పర్ ఆత్మహత్యాయత్నం

విధుల్లో చేరకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తామని అధికారులు హెచ్చరించడంతో అనంతపురం రాణీనగర్ 9 సెంటర్ హెల్పర్ సరిత ఆదివారం రాత్రి విషం తాగి ఆత్మహత్యకు యత్నించారు. సమ్మె నేపథ్యంలో జీతంలో కోత పడింది. అధికారుల ఒత్తిడి, కుటుంబ సమస్యల నడుమ ఆమె బలవన్మరణానికి యత్నించారు. విషం తాగిన ఆమెను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. 'నాకు ఇద్దరు పిల్లలున్నారు. నేనొక్కదాన్నే కుటుంబాన్ని నెట్టుకురావాలి. నిత్యావసరాల ధరలు పెరిగాయి. ఈ జీతంతో బతకడం కష్టంగా మారింది. జీతం పెంచమంటే ఎస్మా చట్టాన్ని ప్రయోగించారు. ఉద్యోగం పోతే ఎలా బతకాలో అనే ఆందోళనతో చావాలని అనుకున్నా..' అని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆమెను పరామర్శించారు. భర్తలేని, ఇద్దరు పిల్లలున్న హెల్పర్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తామని బెదిరించడం ఏమిటని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆత్మహత్యలు వద్దు.. పోరాడుదాం

- ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి

ప్రభుత్వ వేధింపులకు జడిసి ఎవరూ ఆత్మహత్యకు పాల్పడవద్దని, పోరాడి హక్కులను సాధించుకుందామని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అన్నారు. ఆత్మహత్యకు యత్నించిన ఆయా సరితను ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు రామాంజినమ్మతో ఆమె పరామర్శించారు. లక్ష మందికి పైగా మహిళలు నెలన్నర నుంచి సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి స్పందించకపోవడం సరికాదని అన్నారు. ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి.. ఎన్నికల తర్వాత పోలీసుల చేత అణచివేయించడం ఏమిటని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ప్రభుత్వానికి పతనం తప్పదు

- సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

అనంతపురం కల్చరల్: అంగన్‌వాడీలను అణచివేయాలని చూస్తున్న వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ హెచ్చరించారు. సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం క్లాక్‌టవర్ బ్రిడ్జి వద్ద రాస్తారోకో నిర్వహించారు. అరగంటపాటు వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో సీఐలు రెడ్డప్ప, ధరణికిశోర్ నేతృత్వంలో పోలీసులు వారిని అరెస్టు చేసి, టూటౌన్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ, సమస్యలను పరిష్కరించకుండా సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రానున్న రోజుల్లో ఆయన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమ్మెలో ఉన్నవారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారని, పోలీసుల ద్వారా ఉద్యమాన్ని అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ మొండి వైఖరివల్ల అనంతపురం నగరానికి చెందిన సహాయకురాలు ఆత్మహత్యకు యత్నించారని, గుత్తి ప్రాజెక్టులో మరో ముగ్గురు మానసిక ఒత్తిడితో ఆస్పత్రిలో చేరారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శులు రామిరెడ్డి, ఆర్వీ నాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాలరంగయ్య, సావిత్రి, నల్లప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, ఎస్సీ ఎస్టీ సంఘాల రాష్ట్ర నాయకులు సాకే హరి, రాజు పాల్గొన్నారు.

నిజమేనా..?

అధికారుల బెదిరింపులతో పలువరు వర్కర్లు, హెల్పర్లు విధుల్లో చేరారు. కానీ అధికారులు చెబుతున్న లెక్కలు అనుమానాస్పదంగా ఉన్నాయి. 22వ తేదీ వర్కర్లు 1862 మంది, ఆయాలు 1,647 మంది విధుల్లో చేరానని పీడీ శ్రీదేవి ఒక ప్రకటన విడుదల చేశారు. 21, 22 రెండు తేదీల్లో కలిపి వర్కర్లు 2,253 మంది, ఆయాలు 2,007 మంది విధుల్లో చేరినట్లు పేర్కొన్నారు.

రేపు రాష్ట్ర బంద్

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్



సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయలేదు. విజయవాడలో రాష్ట్ర ప్రభుత్వం దౌర్జన్యానికి పాల్పడింది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అంగన్‌వాడీలు కన్నీరు పెట్టుకుంటూ విధుల్లోకి చేరుతున్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలి. ప్రభుత్వ తీరుకు నిరసనగా అన్ని ట్రేడ్ యూనియన్లతో కలసి ఈ నెల 24న రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తున్నాం.

స్పెషల్ కోర్టుకు హాజరైన టీడీపీ నాయకులు


కోర్టు ఆవరణలో ఉన్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జనవరి 22: విజయవాడలోని స్పెషల్ కోర్టుకు ఉమ్మడి అనంత జిల్లాకు చెందిన టీడీపీ నాయకులు సోమవారం హాజరయ్యారు. 2011లో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య జరిగిన గొడవకు సంబంధించిన కేసులో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యేలు బీకే పార్థసారధి, గోనుగుంట్ల సూర్యనారాయణ, నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్యచౌదరి, ప్రకాష్‌నాయుడు, బీవీ వెంకటరాముడు, స్వామిదాస్, సరిపూటి రమణ, కూచి హరి, కృష్ణకుమార్, మణికంఠ, చెన్నప్ప కోర్టుకు హాజరైన వారిలో ఉన్నారు.

విధుల్లో చేరిన డీఆర్‌ఎం వినీత్ సింగ్

గుంతకల్లు, జనవరి 22: స్థానిక డీఆర్‌ఎం మనీశ్ అగర్వాల్ బదిలీకాగా, ఆయన స్థానంలో నూతన డీఆర్‌ఎంగా వినీత్ సింగ్ సోమవారం ఉదయం విధుల్లో చేరారు. ప్రస్తుతం డీఆర్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న మనీశ్ అగర్వాల్ నాగపూర్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. సంబల్పూర్ డీఆర్‌ఎంగా పనిచేస్తున్న వినీత్ సింగ్‌ను గుంతకల్లు డీఆర్‌ఎంగా బదిలీచేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం వినీత్ సింగ్ గుంతకల్లుకు వచ్చారు. తొలుత కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈఓ మల్లికార్జున ఆధ్వర్యంలో అర్చకులు డీఆర్‌ఎంకు ఆశీర్వచనం పలికి శాలువతో సన్మానించారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయానికి వెళ్లారు. డీఆర్‌ఎం మనీశ్ అగర్వాల్ వినీత్ సింగ్‌ను సాదరంగా ఆహ్వానించి బాధ్యతలను అప్పగించారు. సబార్డినేట్ అధికారులు, సిబ్బంది సహకారాన్ని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


నూతన డీఆర్‌ఎం వినీత్ సింగ్‌కు శుభాకాంక్షలను తెలుపుతున్న మనిశ్ అగర్వాల్

పెళ్లి చేసుకుంటానని మోసగించారు

- ఆర్‌ఎస్‌ఐపై పోలీసులకు యువతి ఫిర్యాదు

అనంతపురం క్రైం, జనవరి 22: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లైబ్రరీని పర్యవేక్షించమంటే ఆ ఆఫీసర్ ప్రేమ వలలో పడ్డాడు. శిక్షణ కోసం వచ్చే ఇంజనీరింగ్ చదివిన ఓ యువతితో ఏఆర్ విభాగంలో పనిచేస్తున్న ఆర్‌ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ప్రేమ వ్యవహారం నడిపాడు. కొత్తగా ఉద్యోగం రావడంతో ఆ పోలీస్ సార్ పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో ఆ లైబ్రరీకి వస్తున్న ఓ యువతి నమ్మింది. ప్రేమించాక ఏం జరిగిందో తెలియదు కానీ తనకేం సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నాడంటూ ఆ యువతి ఆదివారం నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. గతంలో జిల్లా ఎస్పీగా ఫక్కీరప్ప ఉన్న సమయంలో పోలీస్ లైబ్రరీకి పర్యవేక్షకుడిగా ఆర్‌ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. ఆర్‌ఎస్ఐపై బదిలీ వేటు వేసినట్లు జిల్లా పోలీస్ అధికారులు సోమవారం ప్రకటించారు. కానీ అతనిని ఆదివారమే చిత్తూరుకు బదిలీ చేయడం గమనార్హం. ఈయనతో పాటు బాలాజీ నాయక్, మగ్బూల్, రమేష్‌నాయక్, ముస్తఫాలను చిత్తూరుకు బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.


బీసీలకు స్వాతంత్య్రం ఎక్కడ?

- ఐదేళ్లుగా వారిపైనే దాడులు
- ఎమ్మెల్యే దోపిడీకి అడ్డుకట్ట వేస్తా
- జయహో బీసీ సభలో పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ, జనవరి 22: దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడిచినా, ధర్మవరం నియోజకవర్గంలో ఐదేళ్లుగా బీసీలు స్వాతంత్య్రం కోల్పోయి బతుకుతున్నారని టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ముదిగుబ్బ మండల కేంద్రంలో సోమవారం జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. వందలాదిగా పార్టీ శ్రేణులు తరలివచ్చారు, ముందుగా అంబేడ్కర్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు, అంబేడ్కర్, వాల్మీకి, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో పరిటాల శ్రీరామ్‌ను గజమాలతో సత్కరించారు. మండలకేంద్రంలో బహిరంగసభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి కదిరి మాజీ ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, హిందుపురం పార్లమెంట్ బీసీ అధ్యక్షుడు రంగయ్య, అంబికా లక్ష్మీనారాయణ, వడ్డే వెంకట్, బీసీ నాయకులు హాజరయ్యారు. నాయకులు రమేష్‌బాబు, కరణం ప్రభాకర్, తుమ్మలమనోహర్, కనుమ చంద్ర, సూర్యశేఖర్‌రాజు, చికెన్‌తిరుపాల్, రాధమ్మ,గడ్డంమోహన్, వినోద్, ఆనంద్, కోట్లబాబి, మహబూబ్‌పీరా, చల్లారంగయ్య, జానీ, నారాయణస్వామి, రంగనాయకులు, సాంబశివనాయక్, మండలంలోని టీడీపి కార్యకర్తలు జనసేన నాయకులు గుర్రంజయచంద్ర, పురుషోత్తం, గుణశేఖర్, పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


బైకు ర్యాలీలో పాల్గొన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

అందరి లెక్కలు తేలుస్తా: పరిటాల శ్రీరామ్



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ధర్మవరం నియోజకవర్గంలో వింత పరిస్థితి ఉంది. ఇక్కడ ఎవరికైనా డబ్బు ఉందనో, ఆస్తి ఉందనో చెప్పుకోవడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. బీసీ కులాలకు చెందిన వారు నియోజకవర్గంలో టీడీపీ జెండా పట్టాలంటే భయపడే పరిస్థితి. ఇన్నిరోజులుగా ఎమ్మెల్యేకి భయపడి మౌనంగా ఉన్నారు. ఇప్పుడైనా ధైర్యంగా ముందుకురండి. దోపిడీదారులు రెవెన్యూ ఆఫీసుల్లోనూ, రిజిస్టర్ కార్యాలయాల్లోని గేట్ల వద్ద ఉంటున్నారు. వారు సాగించిన దోపడీలకు బలైంది ఎక్కువమంది బీసీలే. లోకేశ్ రాష్ట్రంలో ఉన్న వారి లెక్కలు తేలిస్తే, ధర్మవరం నియోజకవర్గంలో పెత్తందారీగా మారిన వారి లెక్క తేలుస్తా.

ధర్మవరంలో టీడీపీ జెండా ఎగరడం ఖాయం: గుండుమల



ధర్మవరంలో టీడీపీ జెండా ఎగరడం ఖాయం. పరిటాల కుటుంబం అంటే అన్ని ప్రాంతాల వారికి అభిమానం. బడుగు బలహీన వర్గాలు అత్యంత ఇష్టపడే కుటుంబం పరిటాల కుటుంబం. ఆ కుటుంబం నుంచి వచ్చిన శ్రీరామ్‌కు వస్తున్న స్పందన చూస్తుంటే ఆశ్చర్యం వేస్తోందని, సీఎం జగన్ ఏమి ఉద్ధరించాడని ఉరవకొండకు వస్తున్నాడో చెప్పాలి.


పరిటాల శ్రీరామ్, కందికుంటకు గజమాలతో సత్కారం

బీసీలు అనుకుంటే అన్ని స్థానాలు టీడీపీవే: కందికుంట



ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీలు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. వారు అనుకుంటే అన్ని స్థానాలు గెలుస్తాం. సీఎం జగన్ నాకు 50 శాతం ఓట్లు వచ్చాయని, 150 సీట్లు వచ్చాయని గర్వంతో ఇన్నిరోజులు పాలన సాగించాడు. ఆ గర్వం దించాలంటే అది బీసీలతోనే సాధ్యం. అప్పట్లో ఎన్టీఆర్ బీసీలకు ధైర్యం నింపి చట్టసభలకు పంపిస్తే, ఈసారి అదే బీసీలు భయంతో బతకాల్సి వస్తోంది. ప్రస్తుతం ఉన్న బీసీ కార్పొరేషన్లకు అధికారం, నిధులు, విధులు నేతి బీరకాయలో నెయ్యిలా మారాయి. ధర్మవరం నియోజకవర్గంలో అధికార పార్టీ దోపిడీ ప్రభుత్వ కార్యాలయాల సాక్షిగా కనిపిస్తోంది. ప్రతి ఒక్కరు ఈ 80 రోజులు రోజుకు గంట పని చేస్తే చాలు టీడీపీ గెలుపు ఖాయం.

సీఎం పర్యటనకు... జన సమీకరణ కష్టాలు!

అనంతపురం క్లాక్‌టవర్/రాయదుర్గం, జనవరి 22: ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్న చందంగా... సీఎం జగన్ పర్యటన యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల మహిళలకు కష్టాలు తెచ్చిపెట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఉరవకొండ ప్రాంతంలో నిర్వహించే ఆసరా పథకం నిధుల చెల్లింపు సభకు లక్ష మంది జనాలను తరలించాలని ప్రధానంగా డీఆర్‌డీఏ-వైకేపీ అధికారులు, ఉద్యోగులు, యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల మహిళలకు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో గ్రామాల వారిగా జనాలను సమీకరించేందుకు పాట్లు పడుతున్నారు. ఇప్పటికే ఆయా గ్రామాల్లో టాంటాం వేస్తున్నారు. ప్రధానంగా ఉరవకొండ, బెళుగుప్ప, విడపనకల్లు, వజ్రకరూరు, కళ్యాణదుర్గం, కణేకల్ మండలాల నుంచి అధికంగా జనాలను తరలించేందుకు సిబ్బంది నిమగ్నమయ్యారు. ఒక్కో మండలానికి వంద బస్సులు చొప్పున ఇప్పటికే కేటాయించారు. పింఛన్, ఆసరా, జగనన్న తోడు తదితర ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు కచ్చితంగా సీఎం సభకు రావాలని, లేకుంటే పథకం కట్ చేస్తామని బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే మోటారు వాహనాల అధికారులు వాహనాల సమీకరణలో నిమగ్నమై సఫలీకృతులయ్యారు. కర్ణాటకకు చేరువలో ఉండడంతో చిత్రదుర్గం, బళ్లారి జిల్లాలలోని ప్రైవేటు బస్సులను అద్దెకు తీసుకు వస్తున్నారు. కర్ణాటకలో మాత్రమే రవాణాకు అనుమతులున్న బస్సులను తీసుకొచ్చి సీఎం సభకు జనం తరలించడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ఇప్పటికే కర్ణాటక రాష్ట్ర పర్మిట్లు ఉన్న వాహనాలు తీసుకువచ్చి నిబంధనలు విరుద్ధంగా జన తరలింపు చేపడుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. సోమవారం రాత్రికి ఆయా వాహనాలన్నీ చేరుకోవడంతో వాటిని గ్రామాలకు కేటాయింపులు చేసి సాగనంపారు.

స్కూళ్లకు సీఎం టూర్ హాలిడే!

- మామయ్య వస్తున్నాడు... ప్రైవేట్ స్కూళ్లకు సెలవ్
- ఎఫ్ఏ- 3 పరీక్షలు ఉన్నా.. వాయిదా ప్రకటన
- అధికార పార్టీకి సాగిలపడుతున్న డీఈఓ


అనంతపురం విద్య, జనవరి 22: సాధారణంగా ఆదివారం, 2వ శనివారం స్కూళ్లకు సెలవు. ఇప్పటి వరకూ ఇలాంటి సెలవులు గురించే విన్నాం. కానీ జగన్ మామయ్య అధికారంలోకి వచ్చాక.... సీఎం టూర్ హాలిడేస్ అంటూ కొత్తగా వింటున్నాం. పిల్లలకు పరీక్షలు ఉండనీ, మరేదైనా ఉండనీ...మామయ్య వచ్చాడంటే వెంటనే సెలవులు ఇచ్చేయడమే. అనంతపురం జిల్లా ఉరవకొండలో సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లకు సెలవు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ స్కూళ్లకు మంగళవారం సెలవులు ఇస్తూ....డీఈఓ మౌఖిక ఆదేశాలిచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా ప్రైవేట్ స్కూళ్లు, కార్పొరేట్ స్కూళ్ల నుంచి 5 లేదా 10 చొప్పున బస్సులు పంపాలంటూ.... విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అధికార పార్టీ నాయకులను, కార్యకర్తలను తరలించానికి వందలాది ప్రైవేట్ బస్సుల బస్సుల తీసుకురావాలని స్కూళ్ల కరస్పాండెంట్లను హెచ్చరికలు జారీ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు మంగళవారం ఎఫ్ఏ-3 పరీక్షలు ఉన్నాయి. ఇప్పటికే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయినప్పటికీ జగన్ వస్తున్నాడంటూ.. ఆ పరీక్షలను సైతం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈనెల 31న పరీక్షలు నిర్వహించాలని కరస్పాండెంట్లకు ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీనిపై ఇన్‌చార్జి డీఈఓ వివరణ కోసం ఆయనకు ఫోన్ చేయగా... ఆయన సమాధానం ఇవ్వలేదు.


గౌరవనీయులు జిల్లా విద్యాశాఖ అధికారి నాగరాజు గారి ఆదేశాల మేరకు అనంతపురం జిల్లా లోని అన్ని ప్రైవేట్ పాఠశాలలకు 23.01.2024 తేదీ మంగళవారం నాడు కాంపెన్సేటరీ సెలవు దినముగా ప్రకటించడం జరిగింది.
ఆ దినం జరగవలసిన FA-3 పరీక్షలు 31.01.2024 బుధవారం నాడు నిర్వహించాలని ఆదేశించడం జరిగినది.
ఈ ఆదేశాలు కేవలం అనంతపురం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు మాత్రమే వర్తిస్తాయి

సెలవు ఇచ్చినట్లు డీఈఓ పేరుతో వైరల్ అవుతున్న సందేశం

వైసీపీ సేవలో డీఈఓ తరిస్తున్నారు

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి



ఉరవకొండకు సీఎం జగన్ వస్తున్నాడంటూ డీఈఓ నాగరాజు ఉన్నఫలంగా ప్రైవేట్ స్కూళ్లకు సెలవు ఎలా ప్రకటిస్తారు. ఆయన అధికార వైసీపీ నాయకుల సేవలో పూర్తిగా తరిస్తున్నాడు. ఎఫ్ఏ-3 పరీక్షలు ఉన్నాయని, ప్రధానోపాధ్యాయులు, టీచర్లు పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే జగన్ వస్తున్నాడని ఏకంగా పరీక్షలను 31వ తేదీన నిర్వహించేలా వాయిదా వేశారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్నారంటూ మండిపడ్డారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

- కారు బోల్తాపడి ఇద్దరు..
- ఆటోను లారీ ఢీకొని ఒకరు..




పార్థసారథి, తులసమ్మ (ఫైల్)

పెనుకొండ రూరల్, జనవరి 22: పెనుకొండ పట్టణంలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... ఒకే కుటుంబానికి చెందిన వారు బంధువుల పెళ్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ప్రమాదవశాత్తు కారుబోల్తాపడి ఇద్దరు మృతిచెందారు. ఈ సంఘటన పెనుకొండ మండలం గోనిపేట బ్రిడ్జి వద్ద 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సంఘటనలో ధర్మవరానికి చెందిన పార్థసారథి (57), తల్లి తులసమ్మ(75) మృతిచెందగా ముగ్గురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ధర్మవరం నేసేపేటకు చెందిన సిల్క్‌వ్యాపారి పార్థసారథి తల్లి తులసమ్మ భార్య మంజుళ, కుమారుడు అఖిల జశ్వంత్, కుమార్తె సౌమ్య గురువారం ఉదయం ధర్మవరం నుంచి కారులో తమిళనాడులోని కంచికి బంధువుల పెళ్లికి వెళ్లారు. రిసెప్షన్ చూసుకుని తిరిగి సోమవారం ఉదయం కారులో ధర్మవరం వస్తుండగా పెనుకొండ సమీపంలోని గోనిపేట బ్రిడ్జి వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పార్థసారథి, తల్లి తులసమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన మంజుళ, అఖిలజశ్వంత్, కృష్ణ సౌమ్యలను స్థానికులు 108 సాయంతో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన మంజుళ, జశ్వంత్‌లను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. మృతుడి కుమార్తె సౌమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

గూడ్స్ ఆటోను ఢీకొన్న లారీ
ఒకరి మృతి... ఐదుగురికి గాయాలు

పట్టణంలోని శ్రీ కృష్ణదేవరాయల వైజంక్షన్ వద్ద 44వ జాతీయరహదారిపై గుర్తుతెలియని లారీ గూడ్స్ ఆటోను ఢీకొన్న ప్రమాదంలో కర్ణాటక వాసి శిరీష(26) మృతిచెందగా మరో ఐదుగురు గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా పలవల్లికి చెందిన హరీష్, భార్య శిరీష, కుటుంబసభ్యులు కలిసి కొన్నేళ్లుగా రికార్డింగ్ డ్యాన్సులు, వీధి నాటకాలు చేస్తూ జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి మండలంలోని గోనిపేటలో రికార్డింగ్ డ్యాన్స్ ముగించుకుని గూడ్స్ ఆటోలో తిరిగి పెనుకొండకు వస్తుండగా శ్రీకృష్ణదేవరాల సర్కిల్ వద్ద పెనుకొండవైపు మలుపు తిరుగుతుండగా గుర్తుతెలియని లారీ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న శిరీష అక్కడికక్కడే మృతిచెందగా భర్త హరీష్, కుమారులు విక్కీ, జోసఫ్, కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108లో పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం హరీష్‌ను తుమకూరుకు తరలించారు. తల్లి మృతి చెందడంతో చిన్నారులు బోరున విలపించారు. పిల్లలను చూసిన వారు కంటతడి పెట్టారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.


శిరీష (ఫైల్)


గాయపడిన చిన్నారులు

వామ్మో సీఎం సభనా..?

- పాత బకాయిలు చెల్లిస్తే సరి
- లేదంటే వాహనాలకు మేం డీజిల్ వేయలేం
- తేల్చి చెప్పిన పెట్రోల్ బంకుల యజమానులు

అనంతపురం, జనవరి 22(ఆంధ్రజ్యోతి): సీఎం సభ అంటేనే పెట్రోల్ బంకుల యజమానులు బెంబేలెత్తుతున్నారు. వామ్మో సీఎం సభనా అంటూ బిత్తరపోతున్నారు. డబ్బులిస్తేనే... డీజిల్ వేస్తామని తేల్చి చెప్పేస్థితికి యజమానులు వచ్చారు. ఇందుకు ప్రధాన కారణం లేకపోలేదు. జిల్లాలో ఎక్కడ సీఎం సభ జరిగినా... వాహనాలు సమకూర్చాల్సిందే... ఆ వాహనాలకు డీజిల్ వేయించాల్సిందే. ఆ బాధ్యతను సంబంధిత శాఖాధికారులు భుజాన ఎత్తుకొని మోస్తున్న పరిస్థితి జిల్లాలో ఉంది. అయ్యా బాబూ... సీఎం సభకు జనాన్ని తరలించాలి. ఏ వాహనం డీజిల్ బంకు దగ్గరకొచ్చినా డీజిల్ పట్టండి. డబ్బులు మళ్లీ ఇస్తామంటూ పెట్రోల్ బంకుల యజమానులను సంబంధిత అధికారులు బతిమలాడుకుంటున్నారు. సీఎం సభ నిర్వహించే రోజుల్లో సభ నిర్వహణలో భాగంగా జనాన్ని తరలించేందుకు వినియోగిస్తున్న ప్రైవేట్ వాహనాలకు డీజిల్ పోయించేందుకు ఆ రోజుకారోజు నిధులు విడుదల చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. గతేడాదిలో కళ్యాణదుర్గం, పుట్టపర్తిలో నిర్వహించిన సీఎం సభలకు సంబంధించి జనాన్ని తరలించేందుకు వినియోగించిన వాహనాలకు డీజిల్ వేసినందుకుగానూ రూ.60 లక్షల వరకూ పెట్రోల బంకుల యజమానులకు బకాయి పడినట్లు ఆ వర్గాల ద్వారా అందిన సమాచారం. ఇప్పటికీ ఆ బకాయి చెల్లించకపోవడంతో... ఉరవకొండలో మంగళవారం నిర్వహించనున్న సీఎం సభ కోసం జనాన్ని తరలించేందుకు సంబంధిత అధికారులు సిద్ధం చేసిన వాహనాలకు డీజిల్ వేసేందుకు పెట్రోల్ బంకు యాజమానులు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. పాత బకాయి చెల్లిస్తేనే... డీజిల్ వేస్తామని తేల్చి చెప్తున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు తలలు పట్టుకుంటున్న పరిస్థితి ఎదురవుతోంది. ఇదిలా ఉండగా... పాత బకాయి చెల్లిస్తాము... ఈసారికి డీజిల్ అప్పుగా వేయండంటూ యజమానులను అధికారులు బతిమలాడుతున్నా... వేసేందుకు ససేమిరా అంటున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు సంబంధిత అధికారులను ఉక్కిరిబిక్కిరి చేస్తుండటం గమనార్హం.


ధర్మవరం మండలం చిగిచెర్లలో ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ, అంజనేయస్వామి మూలవిరాట్‌లు


ధర్మవరంలోని కొత్తపేట రామాలయంలో..


అమడగూరు మండలం కొత్తపల్లిలో..


తనకల్లులో ప్రత్యేక వాహనంలో సీతారాముల చిత్రపటం ఊరేగింపు


ధర్మవరంలో..


కొత్తచెరువులో..

జగమంతా.. రామమయం

- రామాలయాల్లో ప్రత్యేక పూజలు
- వాడవాడలా మోర్మోగిన రామనామం
- అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వేడుకలు


పుట్టపర్తిలో శోభాయాత్ర

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని సోమవారం పుట్టపర్తి, కదిరి, ధర్మవరం నియోజకవర్గాల్లోని పట్టణాలు, మండలకేంద్రాలు, గ్రామాల్లోగల రామాలయాల్లో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు ఆలయాల్లో మూలవిరాట్‌లకు అలంకరణలు, విశేషపూజలు జరిపారు. భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. భక్తులు పెద్దఎత్తున హాజరై జై శ్రీరామ్ అనే రామనామ జపంతో భక్తిని చాటుకున్నారు. ఇక సాయంత్రం ఇళ్లవద్ద దీపాలు వెలిగించి ఎన్నో ఏళ్ల కల సాకారం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. చాలా ప్రాంతాల్లో సీతారాముల విగ్రహాలు, చిత్రపటాలను ఊరేగించి శోభాయాత్రలు నిర్వహించారు. అలాగే విద్యార్థులు, భక్తులు స్వచ్ఛందంగా తరలివచ్చి ర్యాలీలు, బైక్‌ర్యాలీలు చేపట్టారు. పలు చోట్ల సీతారామ, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వేషధారణలతో విద్యార్థులు అలరించారు. ఆలయాల వద్ద పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.


నల్లమాడలో సీతారామలక్ష్మణ వేషధారణలతో విద్యార్థుల శోభాయాత్ర..


గాండ్లపెంటలో సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


బుక్కపట్నంలో శోభాయాత్ర


నంబులపూలకుంటలో బైక్ ర్యాలీ



ధర్మవరంలో పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినుల ర్యాలీ


ముదిగుబ్బలో అన్నదానం..

వైసీపీ శ్రేణులు.. టీడీపీలోకి చేరిక


టీడీపీలోకి చేరిన వారితో కందికుంట

నంబులపూలకుంట, జనవరి 22: మండలకేంద్రంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు 23మంది టీడీపీలోకి చేరారు. కదిరి పట్టణంలోని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ నివాసంలో సోమవారం వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కందికుంట వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు సైనికుల్లా కృషిచేయాలని సూచించారు. నాయకులు దండే రవి, పాలగిరిబాషా ఆధ్వర్యంలో వారంతా టీడీపీలోకి చేరారు. చేరినవారిలో రెడ్డెప్పరెడ్డి, రమణయ్య, క్రిష్ణప్ప, వెంకటయ్య, మౌలాలి, మస్తాన్, మహమ్మద్ పీరా, రహీమ్, సయ్యద్, వంశీం, బాబాగాంధీ, మల్లి, పవన్, బాలాజీ, భరత్, ప్రశాంత్, ప్రవీణ్, మాధవరెడ్డి తదితరులున్నారు.


టీడీపీలోకి చేరిన వారితో పరిటాల శ్రీరామ్

ముదిగుబ్బ: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన జయహో బీసీ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో మండలంలోని బీ.కొట్టాల గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు మురళీయాదవ్‌తో పాటు 20 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి పరిటాల శ్రీరామ్ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే మండలకేంద్రంతో పాటు పీసీ రేవు, గుంజేపల్లి, నల్లచెర్లోపల్లి, నాగులగుబ్బ గ్రామాల నుంచి 15 కుటుంబాల వారు శ్రీరామ్ ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరారు.

సీతారాముల కల్యాణోత్సవంలో కందికుంట

నల్లచెరువు, జనవరి 22: మండలంలోని ఓరువాయి పంచాయతీ మారిశెట్టిపల్లి గ్రామంలో సోమవారం గ్రామస్థులు సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ హాజరై ప్రత్యేక పూజలు చేయించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఏపీని గంజాయి రాష్ట్రంగా మార్చారు: పల్లె

పుట్టపర్తి, జనవరి 22: తెలుగుదేశం పాలనలో అరకు కాఫీ తోటలకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చిందని, అయితే వైసీపీ పాలనలో మాత్రం ఏపీకి గంజాయి రాష్ట్రంగా గుర్తింపు తెచ్చారని మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో యువతకు ఉపాధి మాటేమోగానీ.. గంజాయి మాత్రం విచ్చలవిడిగా దొరికేలా చేశారని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ చూసినా భూరక్షణ చట్టంతో ప్రజల ఆస్తులు తీసుకోవడానికి జగన్ కుట్ర పన్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే భూరక్షణ చట్టం రద్దు చేస్తామన్నారు.

రామాలయానికి రూ.లక్ష విరాళం

నల్లచెరువు, జనవరి 22: మండలంలోని బొమ్మిరెడ్డి పల్లి గ్రామ రామాలయానికి టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్, అరుణ దంపతులు రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందించినట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం దాతలను గ్రామస్థులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. తొలుత వారు అయోధ్యరామయ్య విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.

వైభవంగా మహంకాళమ్మ గ్రామోత్సవం


గ్రామోత్సవంలో వెండిరథంపై అమ్మవారు

ధర్మవరం రూరల్, జనవరి22: మండలంలోని గొట్లూరు గ్రామంలో మహంకాళమ్మ 12వ వార్షిక గ్రామోత్సవ వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా జరిపారు. ఆలయ కమిటీసభ్యులు గ్రామపెద్దల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది సంక్రాంతి పండుగ తర్వాత మహంకాళమ్మ ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను ఆలయ పూజారి కాటమయ్య రకరకాల పూలమాలలతో, వెండి గొడుగులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో 500మంది ముత్తైదు మహిళలకు ఒడిబియ్యం అందజేశారు. వివిధ ప్రాంతాల నుంచి సైతం భక్తులు పెద్దఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రి సమయంలో అమ్మవారిని ఉత్సవ విగ్రహాన్ని వెండి రథంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయండి : కలెక్టర్


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, జనవరి 22: జిల్లావ్యాప్తంగా ప్రజలు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. జిల్లాకేంద్రంలో సోమవారం ఆయన రవాణాశాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. హిట్‌అండ్ రన్ మోటారు ప్రమాదాల బాధితులకు నష్టపరిహారం అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీపీఓ కరుణాసాగర్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఐ సంజీవయ్య, పీఆర్‌ఏఈ గోపాల్‌రెడ్డి, ఎంవీఐలు పాల్గొన్నారు.

పుట్టపర్తిరూరల్: జిల్లా కేంద్రంలోని పోలీసుకార్యాలయంలో ఎస్పీ మాధవరెడ్డి రోడ్డుభద్రతా మాసోత్సవాల బ్రోచర్లు, వాల్‌పోస్టర్లను జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి కరణాసాగర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డుప్రమాదాలు జరిగినప్పుడు సంఘటనా స్థలాల్లో ఉన్న వ్యక్తులు బాధితుల్ని ఆస్పత్రులకు తీసుకెళ్లాలని సూచించారు. హిట్ అండ్ రన్ మోటారు యాక్సిడెంట్ స్కీం 2022 కింద ఎవరైనా గాయపడితే రూ.50వేలు, మరణిస్తే రూ. 2లక్షలు నష్టపరిహారం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డీటీఓ కరుణాసాగర్‌రెడ్డి, స్పెషల్‌బ్రాంచ్ సీఐ రవీంద్రనాథరెడ్డి, సీఐ శ్రీహర్ష, ఎంవీఐలు వరప్రసాద్, శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్పందనకు 130 వినతులు

పుట్టపర్తి/ పుట్టపర్తిరూరల్, జనవరి 22: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ 130 వినతిపత్రాలను అందించారు. కలెక్టర్ అరుణ్‌బాబు వాటిని స్వీకరించి సమస్యల్ని సకాలంలో పరిష్కరించాలని ఆయా సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ఈనెల 28వరకు కులగణన జరుగుతుందని, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. జిల్లాలోని 544 సచివాలయాల ద్వారా కులగణన సాగుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా 6,17,784కుటుంబాలున్నాయని, ప్రతి కుటుంబమూ కులగణనలోకి వచ్చేలా సర్వే చేయాలని తెలిపారు. అలాగే ఈనెల 26న జరిగే రిపబ్లిక్‌డే వేడుకలకు ముందస్తు ఏర్పాట్లుచేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కొండయ్య, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సచివాలయ నోడల్ అధికారి శివారెడ్డి, ఆర్డీవో భాగ్యరేఖ పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 16 వినతులు

పుట్టపర్తిరూరల్: పట్టణంలోని జిల్లాపోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 16 వినతిపత్రాలు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతులను ఎస్పీ మాధవరెడ్డికి అందజేశారు. ఎస్పీ వాటిని స్వీకరించి పరిశీలించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పోలీసు చట్టపరిధిలో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఏఎస్పీ విష్ణు, జిల్లాక్రైం బ్రాంచ్ సీఐ సతీస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పట్టు రైతులు, రీలర్ల సమస్యల్ని పట్టించుకోని ప్రభుత్వం

- రైతుసంఘం, సీపీఐ నాయకుల మండిపాటు


సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న రైతుసంఘం, సీపీఐ నాయకులు

ధర్మవరం, జనవరి 22: రాష్ట్ర ప్రభుత్వానికి పట్టురైతులు, రీలర్ల సమస్యలు పట్టవా.. అంటూ ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లిపెద్దన్న, సీపీఐ రైతుసంఘం జిల్లా సహాయకార్యదర్శి జేవీరమణ మండిపడ్డారు. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ... పట్టణంలోని పట్టురైతులు, రీలర్లు సోమవారం 6వ రోజూ స్థానిక సిరికల్చర్ కార్యాలయం వద్ద సమ్మె కొనసాగించారు. ఇందుకు జంగాలపల్లిపెద్దన్న, జేవీరమణ సంఘీబావం ప్రకటించి మాట్లాడారు. ధర్మవరం సిరికల్చర్ కార్యాలయ పరిధిలో 500 మంది రైతులకు రూ.10 కోట్ల దాకా ఇన్సెంటివ్ బకాయిలు రావాల్సి ఉందన్నారు. జగన్ తన పాదయాత్రలో పెండింగ్‌లో ఉన్న ఇన్సెంటివ్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క రుపాయి కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పట్టురైతులు, రీలర్ల సమస్యలు పట్టించుకోకుంటే భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్ష,కార్యదర్శులు వెంకటస్వామి, వెంకటనారాయణ, సీఐటీయూసీ నాయకుడు రమణ, చేనేత నాయకుడు ఆదినారాయణ, పట్టురైతుల సంఘం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి, రీలర్స్ సంఘం నాయకులు శ్రీనివాసరెడ్డి, అచ్యుత, సుబ్రమణ్యం, మహమ్మద్ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- పోలీస్ అధికారులకు ఎస్పీ సూచన
- సీఎం పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్ల పరిశీలన


విమానాశ్రయంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ, ఆర్డీఓ

పుట్టపర్తిరూరల్, జనవరి 21: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా పోలీసు అధికారులు సమన్వయంతో విధులను నిర్వర్తించాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. జిల్లాకేంద్రంలోని శ్రీసత్యసాయి విమానాశ్రయలో సోమవారం ఆయన అధికారులతో కలిసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అంతకు మునుపు సీఎం జిల్లాపర్యటనకు సంబంధించి బందోబస్తుపై స్థానిక సాయిఆరామంలో బ్రీఫింగ్ చేశారు. సీఎం మంగళవారం ఉదయం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో పుట్టపర్తికి చేరుకుంటారని, అనంతరం ఇక్కడి నుంచి ప్రత్యేక హెలీకాప్టర్‌లో బయలుదేరి ఉరవకొండ జూనియర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగ సభలో పాల్గొనడానికి వెళతారని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన ముగిసే వరకు ఎయిర్‌పోర్టు పరిసర ప్రాంతాల్లో బందోబస్తుపై సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ విష్ణు, ఆర్డీఓ భాగ్యరేఖ, ఎంఆర్ఓ నవీన్‌కుమార్, డీఎస్పీలు వాసుదేవన్,హుస్సేన్‌పీరా,శ్రీలత, ఏఆర్‌డీఎస్పీ విజయ్‌కుమార్, స్పెషల్‌బ్రాంచ్ సీఐ రవీంద్రనాథరెడ్డి, సీఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు భారీ బందోబస్తు

ముఖ్యమంత్రి జిల్లాపర్యటనకు సంబంధించి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఏఎస్పీ ఒకరు, డీఎస్పీలు నలుగురు, సీఐలు పదిమంది, ఎస్‌ఐలు 31 మంది, హెడ్‌కానిస్టేబుళ్లు 94 మంది, పోలీసులు 150 మంది, మహిళాపోలీసులు 12 మంది, హోంగార్డులు 40 మంది, అదనపు బలగాలను 500 మందిని బందోబస్తులో వినియోగిస్తున్నట్లు ఎస్పీ వివరించారు.

జయహో బీసీని విజయవంతం చేయండి

నల్లమాడ, జనవరి 22: మండలంలో మంగళవారం నిర్వహించనున్న జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలోని తన నివాసంలో సోమవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమానికి మాజీ మంత్రిపల్లె రఘునాథ రెడ్డి హాజరవుతారన్నారు. అన్ని గ్రామాలనుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో రావాలన్నారు. తొలుత బైక్ ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

చలో విజయవాడకు తరలిన అంగన్‌వాడీలు

పుట్టపర్తిరూరల్, జనవరి 22: విధుల్లో చేరకపోతే విధుల నుంచి తొలగిస్తామని కలెక్టర్ హెచ్చరించినా.. అంగన్‌వాడీలు ఏమాత్రం బెదరలేదు. ఈ క్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళ్లారు. తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు 42 రోజులుగా సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్వాడీ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. విధులకు చేరని అంగన్‌వాడీలను విధుల నుంచి తొలగిస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించినా.. జిల్లాలోని పలు ప్రాంతాల అంగన్వాడీలు బెదరకుండా చలో విజయవాడ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు. పోలీసుల అరెస్టులు, నోటీసులను సైతం లెక్కచేయలేదు. అక్కడక్కడ కొంతమంది మాత్రం ప్రభుత్వ బెదిరింపులతో విధుల్లోకి చేరారు.

రేపటి నుంచి బాస్కెట్‌బాల్ జిల్లాస్థాయి పోటీలు

ధర్మవరం, జనవరి 22: 75వ గణతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు అండర్-14 జిల్లాస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలను నిర్వహించనున్నట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆర్గనైజ్ సెక్రెటరీ శెట్టిపి జయచంద్రారెడ్డి తెలిపారు. పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆత్మీయట్రస్టు సౌజన్యంతో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు.

ధర్మవరం సెబ్ సీఐగా గురుప్రసాద్

ధర్మవరం, జనవరి 22: ధర్మవరం సెబ్ సీఐగా గురుప్రసాద్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న లక్ష్మీదుర్గయ్య చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి బదిలీ అయ్యారు. దీంతో గురుప్రసాద్ పీలేరు నుంచి బదిలీపై వచ్చారు.

అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేయాలి

- శాస్త్రవేత్తల సూచన
- కదిరి పరిశోధన స్థానంలో సమీక్ష

కదిరి, జనవరి 22: రైతుకు లాభాలు సమకూర్చే అధిక దిగుబడులను ఇచ్చే వేరుశనగ నూతన వంగడాలను అభివృద్ధి చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ప్రశాంతి, విస్తరణ సంచాలకుడు సుబ్బరామిరెడ్డి సూచించారు. వారు సోమవారం పరిశోధన స్థానాన్ని సందర్శించారు. వ్యవసాయ క్షేత్రంలో జరుగుతున్న పరిశోధనలు, వంగడాల అభివృద్ధిని పరిశీలించారు. వేరుశనగ నూతన వంగడాల పరిశోధనలను గురించి శాస్త్రవేతలు డాక్టర్ ప్రసన్న, రాజేష్, నీలిమతో సమీక్షించారు. అధిక దిగుబడినిచ్చే, బెట్ట పరిస్థితులు, చీడపీడలను తట్టుకునే రకాలను అభివృద్ధి చేసే దిశగా పరిశోధనలు చేయాలని సూచించారు. వేరుశనగలో సూక్ష్మజింక్, క్యాల్షియం ఎరువులను వాడుకుని దిగుబడి పెంచేలా పరిశోధనలు చేయాలన్నారు. క్షారగుణం కలిగిన నీటితో దిగుబడులు తగ్గకుండా నియంత్రించాలన్నారు. దేశంలోనే ఉత్తమ వేరుశనగ ఉత్పత్తి కేంద్రంగా అవార్డు అందుకున్నందుకు శాస్త్రవేత్తలను అభినందించారు. ఇదే ఒరవడి కొనసాగించాలని సూచించారు. కదిరి పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తలు సంపత్‌కుమార్, వెంకటేశ్వర్లు, వేమన, చంద్రాయుడు వెంకటరమణ పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ఓబుళదేవరచెరువు, జనవరి 22: మండలకేంద్రంలోని కస్తూరిబా గాంధీబాలికల పాఠశాలలో నాడు, నేడు కింద జరుగుతున్న పనులను డీఈఓ మీనాక్షి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు గదుల నిర్మాణ పనులను క్షుణంగా పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న నాలుగు కేజీబీవీల్లో.. ఒక్కొక్క పాఠశాలలో నాలుగు అదనపు గదుల పనులు జరుగుతున్నాయన్నారు. వచ్చిన నిధులకు సరిపడా పనులు జరిగాయాలేదా అన్నవాటిని పరిశీలించామన్నారు. ఆమె వెంట ఎంఈఓలు సురేష్‌బాబు, రమణ ఉన్నారు.

విజయవాడకు వెళ్లకుండా ముందస్తు అరెస్టు

అమడగూరు, జనవరి 22: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని విజయవాడలో సీఎం జగన్‌ను కలవడానికి గాను చలో విజయవాడ కార్యక్రమానికి అంగన్‌వాడీల రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. అయితే ఈ కార్యక్రమానికి మండలంలోని అంగన్‌వాడీలు, సీఐటీయూ నాయకులు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణను ఎస్‌ఐ బలరామయ్య, ముందస్తుగా అరెస్టు చేసి సాయంత్రం వరకు స్టేషన్‌లో ఉంచారు.

సచివాలయంలో ఎంపీడీఓ విచారణ

ఆంధ్రజ్యోతి స్పందన

నంబులపూలకుంట, జనవరి 22: మండలంలోని మేకలచెరువు గ్రామ సచివాలయంలో ఓ ఉద్యోగి చేస్తున్న అక్రమాలపై గత శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో లంచావతారం అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ ఆదినారాయణ ఆ గ్రామ సచివాలయంలో సోమవారం విచారణ చేపట్టారు. ఫిర్యాదు ల దారుల వివరాలను సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపనున్నట్లు తెలిపారు. కార్యదర్శులు జహీర్, అలీ ఉన్నారు.

స్టీలు ఊతకర్రల పంపిణీ

ఓబుళదేవరచెరువు, జనవరి 22: మండలకేంద్రంలో సోమవారం న్యూకాంతి వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఇంతియాజ్, మండలాధ్యక్షుడు తొట్లిపల్లి అబ్బాస్ పలువురికి ఉచితంగా స్టీల్ ఊతకర్రలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ నడవలేని స్థితిలో ఉన్న 48మందికి వికలాంగులను, వృద్ధులను గుర్తించి కర్రలు పంపిణీ చేసినట్లు చెప్పారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, జనవరి 22: 18ఏళ్ల వయసు నిండిన వారికి ఇంకా ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని ఆర్డీఓ భాగ్యరేఖ సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సవరించిన తుది ఓటరు జాబితాను పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆమె విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 238 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం 2,10,076 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఇందులో పురుషులు 1,04,092 మంది, మహిళలు 1,05,970 మంది, ఇతరులు 14 మంది ఉన్నారన్నారు. నియోజకవర్గంలో పురుషులకంటే మహిళా ఓటర్లు 1878 మంది అధికంగా ఉన్నారన్నారు. 18ఏళ్ల వయసు నిండిన యువత ఆన్‌లైన్‌లో ఓటరుగా నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో డీఏఓ జిలానీ, ఎన్నికల డీటీ నరసింహులు, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

రథయాత్ర పోస్టర్ల విడుదల

తనకల్లు, జనవరి 22: మండలంలోని కొక్కంటి క్రాస్‌లో సోమవారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు సేవాలాల్ మహారాజ్ శాంతి సద్భావన రథయాత్ర పోస్టర్లను విడుదల చేశారు. పలువురు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన అనంతపురం జిల్లా కేంద్రంలో జరుగు రథయాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఆల్‌ఇండియా బంజారా సంఘం మండల అధ్యక్షుడు మూడే ఉత్తన్న నాయక్, సర్పంచ్ మూడే కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ఆలయంలో ప్రతిష్ఠించిన సీతారామలక్ష్మణ, ఆంజనేయ, వాల్మీకి విగ్రహాలు

హిందూపురం అర్బన్, జనవరి 22: పట్టణ పరిధిలోని సూరప్పకట్ట వాల్మీకి వీధిలో వెలసిన రామభజన మందిరంలో సోమవారం సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి విగ్రహాలతో పాటు వాల్మీకి మహర్షి విగ్రహాన్ని వైభవంగా ప్రతిష్ఠించారు. దాత వైఎన్ భాస్కర్ అండ్ బ్రదర్స్ సహకారంతో విగ్రహప్రతిష్ఠ చేపట్టారు. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠ జరిగిన సమయంలోనే వీటిని ప్రతిష్ఠించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రాణప్రతిష్ఠ అనంతరం హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, భజనలు చేపట్టారు. నిర్వాహికులు చంద్ర, నటరాజ్, అనీల్, గణేష్, మంజు, శ్రీకాంత్, విజయ్, అశోక్ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కరసేవకులకు సన్మానం



కరసేవకులను సన్మానిస్తున్న దృశ్యం

పెనుకొండ, జనవరి 22: రామజన్మభూమి అయోధ్యలో 1991లో జరిగిన కరసేవకు వెళ్లి పోలీసుల లాఠీ దెబ్బలకు గురై గాయపడి వచ్చిన పెనుకొండకు చెందిన వీహెచ్‌పీ బీజేపీ కార్యకర్తలను ఘనంగా సత్కరించారు. సోమవారం అయోధ్య బాలరాముని ప్రాణప్రతిష్ఠ పురస్కరించుకుని స్థానిక రామభద్రాల యంలో కరసేవకు వెళ్లిన బీజేపీ నాయకులు పాలూరి క్రిష్ణమూర్తి, కన్నాస్వామి, కంబాలపల్లి వెంకటేశులు, గోవిందు, కేదారినాథ్, తదితరులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్, రామక్రిష్ణ, వీహెచ్‌పీ ప్రఖండ్ అధ్యక్షుడు వేదవ్యాస్, బక్సంపల్లి రామక్రిష్ణ తదితరులు పూలమాలలువేసి శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

సందర్శించిన ఎఫ్‌సీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుచిత్రకుమార్ పట్నాయక్



ఆలయాన్ని సందర్శిస్తున్న ఎఫ్‌సీఐ ఈడీ దంపతులు

లేపాక్షి, జనవరి 22 : మండలకేంద్రంలోని ప్రపంచ ప్రసిద్ధి గాంచిన దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో చిత్ర, శిల్ప కళలు అద్భుతంగా ఉన్నాయని నార్త్‌జోన్ ఎఫ్‌సీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుచిత్ర కుమార్ పట్నా యక్ అన్నారు. ఆయన సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్థాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు.

యువతి అదృశ్యంపై కేసు

పెనుకొండ రూరల్, జనవరి 22 : మండలంలోని కొండంపల్లికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు పెనుకొండ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన మేరకు... కొండంపల్లికి చెందిన హనుమంతనాయక్ కుమార్తె అనూషబాయి ఇంటర్ పూర్తిచేసి గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తుండేది. ఆదివారం ఉదయం అనూషబాయి ఇంటి నుంచి బయటికి వెళ్లింది. అయితే సాయంత్రమైనా తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం ఉదయం హనుమంతనాయక్ పెనుకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వన్య ప్రాణుల నుంచి రక్షణ కల్పించండి

రైతు సంఘం నాయకుడు పూజారప్ప

పావగడ, జనవరి 22: తాలూకా వ్యాప్తంగా రెండు నెలల నుండి వన్యప్రాణులు నుంచి పశువులు, మేకలకే కాకుండా మనుషులపై కూడా దాడి చేస్తున్నాయని.. వాటి నుంచి రక్షించడానికి అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప కోరారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... వన్యప్రాణులను బంధించి వేరొకచోటికి తరలించాలని లేకపోతే చాలా మందికి ప్రాణముప్పు ఉందన్నారు. అదేవిధంగా తహసీల్దార్, ఎమ్మెల్యే చొరవతీసుకొని బంజరు భూములు సాగుచేసినవారికి పట్టాలు ఇప్పించాలని ఆయన కోరారు. భద్రా నీటి కోసం అనేక స్వచ్ఛంద సేవా సంస్థలు నెలల తరబడి ధర్నాలు నిర్వహిస్తున్నా ఇప్పటి వరకు నీరు అందకపోవడం దురదృష్టకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పావగడకు ప్రముఖంగా బైపాస్ రోడ్డు వసతి కల్పించాలని, శ్రావణ మాసంలో అధికసంఖ్యలో భక్తులు వస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. కెషిప్ అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



పెనుకొండ రామభద్రాలయం వద్ద టీడీపీ శ్రేణుల జైశ్రీరామ్ నినాదాలు



పురంలో జై శ్రీరామ్ నినాదంతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

ఉప్పొంగిన రామభక్తి

(ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్)

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం ప్రజల్లో రామభక్తి ఉప్పొంగింది. రామభక్తులు వివిధ రకాలుగా తమ భక్తిని ప్రదర్శించారు. శ్రీరాముడు, ఆంజనేయస్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో, ఇళ్లలో ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. రామభక్తి గీతాలాపన, భజనలు చేపట్టారు. బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠించిన సమయంలోనే పూజలు చేశారు. పెద్దఎత్తున ప్రసాద వినియో గం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవవిగ్రహాలను ఊరేగించారు. రాత్రి దీపారాధన కార్యక్రమం చేపట్టారు. హిందువుల 500సంవత్సరాల కల అయోధ్య శ్రీరామ మందిరం కల నెరవేరిందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత అన్నారు. సోమవారం అయోధ్యలో రామమందిరం విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా సవిత ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అలాగే మడకశిరపట్టణంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు.



సోమందేపల్లిలో పెద్దఎత్తున జైశ్రీరామ్ అంటూ ర్యాలీ



రొద్దంలో ర్యాలీ చేస్తున్న భక్తులు



పెనుకొండలో ప్రత్యేక అలంకరణలో శ్రీరామభద్రుడు



గోరంట్లలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప



పురం గాంధీ సర్కిల్‌లో రాముడి పూజలు చేసిన భక్తులు



నానెప్పనగర్‌లో ప్రసాద వితరణ చేస్తున్న దృశ్యం



మామిడిమాకులపల్లిలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



చిలమత్తూరులో శోభాయమానంగా రాముడి ఊరేగింపు



కోనాపురంలో ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



వినాయక సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం



కల్లుమర్రిలో సీతారాముల కల్యాణోత్సవం



మడకశిరలో వీహెచ్‌పీ బైక్ ర్యాలీ



లక్ష్మీపురం భజనమందిరంలో భజనలు చేస్తున్న భక్తులు



పురంలో రాములవారి ఊరేగింపు



రొళ్లలో స్వామిజీని సన్మానిస్తున్న భక్తులు



ఎస్ఎస్ గుండ్లు గ్రామంలో ఆంజనేయస్వామికి జ్యోతులు మోస్తున్న మహిళలు



విద్యానగర్‌లోని వేంకటేశ్వర ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు

విజయవాడకు వెళ్లకుండా నాయకుల అరెస్ట్

పెనుకొండ, జనవరి 22 : సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా నాయకులను పోలీసు లు ముందస్తు అరెస్ట్ చేశారు. పట్టణంలోని అంగన్‌వాడీల దీక్షా శిబిరాన్ని సోమవారం తెల్లవారుజామున నేలకూల్చారు. అనంతరం నాయకుల ఇళ్లకు వెళ్లి ఉన్నవాళ్లను ఉన్నట్లుగా అరెస్ట్‌చేసి స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్‌తోపాటు పలువురు నాయకులను అరెస్ట్‌చేశారు.



సీఐటీయూ నాయకుడు రమేష్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

24న రాష్ట్రబంద్

అంగన్‌వాడీలకు మద్దతుగా బుధవారం రాష్ట్రబంద్‌కు పిలుపునిచ్చినట్లు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎస్‌టీయూ నాయకులు పిలుపునిచ్చారు.

మహిళా సాధికార జీతభత్యాలు, పనిభారాలు తదితర సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ అంగన్ వాడీ సంఘాల ఆధ్వర్యంలో 42రోజులుగా సమ్మె చేస్తున్నామన్నారు. వారి డిమాండ్లను నెరవేర్చకపోవడమే గాకుండా ఎస్మా చట్టాన్ని ప్రయోగించి అత్యంత నిరంకుశంగా మారిందన్నారు. నాయకులను అరెస్ట్ చేయడంతో పాటు దీక్షా శిబిరాలను ధ్వంసం చేసి సమ్మెను భగ్నం చేశారన్నారు. అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేసి విధులకు హాజరయ్యేలా చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. వీటిని నిరసిస్తూ ఈనెల 24న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చినట్లు నాయకులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్మాకు భయపడి.. విధులకు..

పెనుకొండ, జనవరి 22 : తమ డిమాండ్ల సాధన కోసం 42రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడంతో భయపడి సమస్య పరిష్కారం కాకుండానే సోమవారం సమ్మె విరమించి విధులకు హాజరయ్యారు. పెనుకొండ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు మొత్తం 301మంది సమ్మె విరమించి విధులకు హాజరవుతున్నట్లు సీడీపీఓ శాంతలక్ష్మిని కలిసి రిపోర్ట్ చేసుకున్నారు. సమ్మె విరమించాలని ప్రభుత్వం ఎస్మా అమలు చేసిందని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. సోమవారంలోగా విధులకు హాజరు కాకపోతే అంగన్‌వాడీలను విధుల నుంచి తొలగించి కొత్త నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రభుత్వం బెదిరించడంతో గత్యంతరం లేక బాధను దిగమింగుకుని అయిష్టంగానే విధులకు హాజరయ్యారు.

మడకశిరటౌన్: ప్రభుత్వ బెదిరింపులకు ఎట్టకేలకు అంగన్‌వాడీ ఉద్యోగులు తలొగ్గారు. మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సోమవారం తాము విధుల్లోకి చేరుతున్నట్లు సీడీపీఓ కార్యాలయంలో జాయినింగ్ పత్రాలను అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని 42 రోజులుగా ఎన్నో విధాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టి చివరకు సమస్యలు పరిష్కారం కాకముందే విధుల్లోకి చేరాల్సిన పరిస్థితి నెలకొంది. కొంత మంది ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తాము విధుల్లోకి చేరుతున్నట్లు తెలిపారు.



పెనుకొండలో సీడీపీఓ శాంతలక్ష్మికి రిపోర్ట్ చేసుకుంటున్న దృశ్యం



మడకశిర సీడీపీఓ కార్యాలయంలో...

బీసీల అభివృద్ధికి కృషిచేసిన టీడీపీ: సవిత



మాట్లాడుతున్న సవిత

పెనుకొండ టౌన్, జనవరి 22 : బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగడానికి ఎనలేని కృషిచేసిన పార్టీ టీడీపీ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పేర్కొన్నారు. ఆమె సోమవారం స్థానిక కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల సమస్యలపై సభలు, సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారని అన్నా రు. ఈ సభలను చూస్తున్న వైసీపీలో వణుకు పు డుతోందన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో బీసీలను అణగదొక్కి వారిని భయభ్రాంతులకు గురిచేసింది ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే జగన్ ఇంటికి పోవాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు పెంచుతూ పేదలపై భారం మోపారన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కార్యకర్తలు తమ జీతాలు పెంచాలని నిరసన తెలియజేస్తే వారిని తొలగించడం సిగ్గుచేటన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. దొంగ ఓట్లను అధికంగా చేర్చి దొడ్డిదారిలో గెలవాలని అనుకుంటున్న వైసీపీ నాయకుల ఆటలు ఈ సారి జరిగే ఎన్నికల్లో ప్రజా ఆగ్రహం ముందు సాగవన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవ నాయుడు, గుట్టూరు సూరి, వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం కోసం విరాళం

హిందూపురం, జనవరి 22 : కర్ణాటకలోని గౌరీబిదనూరు తాలూకా పోతన హళ్లిలో ఆంజనేయస్వామి ఆలయానికి విగ్రహాన్ని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్ దంపతులు విరాళం ఇచ్చారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా పోతనహళ్లిలో అంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. ఈ విగ్రహానికి రూ.91వేలు అందించి విగ్రహాన్ని తీసిచ్చినట్లు బేవనహళ్లి ఆనంద్, మాజీ సర్పంచ్ మాలతి తెలిపారు. విగ్రహ దాతలను గ్రామస్థులు సత్కరించారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసీపీని సాగనంపాలి : బీకే

పెనుకొండ, జనవరి 22 : వైసీపీ అధికారం చేపట్టిన ఐదేళ్లలో రాష్ట్రం అభివృద్ధిలో 20ఏళ్లు వెనక్కు వెళ్లిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే వైసీపీని ఇంటికి సాగనంపాలన్నారు. ఆయన సోమవారం విజయవాడ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆదాయం రూపాయి కూడా పెరగలేదన్నారు. ఉద్యోగాలు రాలేదన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బాదుడే బాదుడు కార్యక్రమం తప్ప క్రిస్మస్‌కానుక, రంజాన్‌తోఫా, సంక్రాంతి కానుకలు ఏమయ్యాయని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు నాణ్యమైన మద్యం సరఫరా చేశామని, వైసీపీ పాలనలో నాసిరకం మద్యం వచ్చిందన్నారు. జగన్‌రెడ్డి మందుబాబుల ను కూడా మోసం చేశాడన్నారు. మద్యనిషేధం చేశాకే ఓటడుగుతానని చెప్పి ప్లేటు ఫిరాయించాడన్నారు. ఆర్టీసీ చార్జీలు, కరెంటు చార్జీలు పెంచడమేకాక చెత్తపన్ను వేసిన చెత్త ముఖ్యమంత్రిగా చరిత్రలో జగన్ నిలిచిపోయాడన్నారు. చెల్లికి న్యాయం చేయనివాడు ప్రజలకు ఏం న్యాయం చేస్తాడన్నారు. మూడు రాజధానుల పేరిట మూడుముక్కలాట ఆడుతున్నాడన్నారు. వైసీపీ ప్రభుత్వం గంజాయి రాష్ట్రంగా మార్చిందన్నారు. బీసీలకు సంక్షేమానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదన్నారు. విలువలులేని వ్యక్తులు రాజకీయాలకు అనర్హులన్నారు. నీతి నిజాయితీ గలవారు రాజకీయాల్లోకి రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి సాగనంపితేనే రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. టీడీపీ అధికా రంలోకి వచ్చాక అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరిస్తామన్నారు.

ప్రొఫెషనల్ వింగ్ మీటింగ్‌కు రండి: గుండుమల



బ్రోచర్ విడుదల చేస్తున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్, జనవరి 22: తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీన జరిగే ప్రొఫెషనల్ వింగ్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీన పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు ప్రొఫెషనల్ వింగ్ తరపున ప్రొఫెష నల్స్ కనెక్ట్ విత్ లీడర్ టౌన్ హాల్ మీటింగ్ జరుగు తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మేధావులు, డాక్టర్లు, న్యాయవాదులు, గ్రాడ్యు యేట్లు, ఐటీ ప్రొఫెషనల్స్, ఇతర రంగాల్లోని నిపుణులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి శివరాజ్, మడకశిర టీపీడబ్ల్యూ అసెంబ్లీ అధ్యక్షుడు నాగరాజు, సభ్యుడు రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్ జన్మదిన వేడుకలకు తరలిరండి

టీడీపీ నాయకులు

పెనుకొండ, జనవరి 22: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్ జన్మదిన వేడుకలకు తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ సిద్దయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి ఆధ్వర్యంలో ఉదయం 10గంటలకు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల నా యకులు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.